క్లుప్తంగా

10వరకు గడువు

కేసముద్రం: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికిగాను ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లించే చివరి గడువు తేదీ ఈనెల 10వరకు ఉందని, ఆలోపుగా విద్యార్థులు ఫీజులు చెల్లించాలని ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్‌లు కొత్త జగన్మోహన్‌రెడ్డి, బండారు నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులు మీసేవా కేంద్రాల్లోగాని, ఇతర ఆన్‌లైన్‌లో సెంటర్‌లలో ఫీజు చెల్లించాలన్నారు. టెన్త్‌లో ఒక్కో పేపర్‌కు రూ.100లు, ఇంటర్‌లో ఒక్కో పేపర్‌కు రూ.150ల చొప్పున, గడువు లోపు ఎలాంటి ఫైన్ లేకుండా ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు కేసముద్రంవిలేజ్ జెడ్పీఎస్‌ఎస్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోస్టల్‌శాఖకు పెద్దపీట

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్–2023లో తపాలాశాఖకు పెద్దపీట వేసిందని నర్సంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, ఆడపిల్లల కోసం కొత్తగా మహిళా బచత్ సమ్మాన్ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌పోస్ట్ మాస్టర్ రాము, బీపీఎంలు మల్లయ్య, చందాగోపి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన జాతర



గూడూరు: మండలంలోని దామరవంచ సమీప జాతీయ రహదారి పక్కన చింతలగట్టు ఒట్టివాగు ఒడ్డున గత మూడు రోజులుగా కొనసాగిన మినీ మేడారం చింతలగట్టు శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ముగిసినట్లు జాతర కమిటీ ప్రెసిడెంట్ పెనక నాగయ్య, ప్రధాన పూజారి సిద్ధు తెలిపారు.

విజయవంతం చేయాలి

గంగారం: ఈనెల 6నుంచి ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల సమక్షం నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరుగుతుందని, ఈ యాత్రకు గ్రామ గ్రామ నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చల్లా నారాయణరెడ్డి అన్నారు. గంగారం మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ ఈసం రమసురేష్, ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, సర్పంచ్‌లు వెంకటలక్ష్మీ, సారక్క, బక్కయ్య, ఈసం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



గూడూరు: మండలంలోని పొనుగోడు జెడ్పీ హెచ్‌ఎస్‌లో శనివారం స్వయం పరిపాలన దినత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పూల్‌సింగ్, ఎస్‌ఎంసీ చైర్మన్ జమీల్ పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన



నర్సింహులపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం డ్రోన్ సహాయంతో మందుల పిచికారీపై అగ్రి కాపిట ఇన్నోటిక్ కంపెనీ ప్రతినిధులు సంతోష్, మహేందర్ రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ సహాయంతో వివిధ రకాల పంటలకు మందుల స్ప్రేతో ఉండే ఉపయోగాలను వివరించారు. మందుల ఆదా అవుతుందని, సమయం వృథా కాదని, కూలీల ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

‘మనఊరు–మనబడి’ పరిశీలన



దంతాలపల్లి: మండలం గున్నెపెల్లి, కుమ్మరికుంట్ల గ్రామాలలో మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పనులు జరుగుతున్న పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను డిప్యూటీ సీఈఓ, శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ జిల్లా అధికారి నర్మద శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ అఫ్సర్‌పాషా, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని ఎత్తివేసే ప్రయత్నం

నర్సింహులపేట: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 100 రోజులు పని ఇస్తున్నామని చెబుతున్న కేంద్రం ఆచరణలో 45నుంచి 50రోజుల పని ఇవ్వడం లేదన్నారు. ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రోజు వారి కూలి రూ.800లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పల్లెలంల పాపారావు, రాజు, సలీం, నారాయణ, వీరన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర: గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజుంపల్లి వీరన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి చింత నవీన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డికి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు పూల్‌సింగ్, వెంకన్న, శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నర్సింహులపేట: ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బయ్యారం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ శనివారం బయ్యారంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం మండల కార్యదర్శి ఉమ్మగాని సత్యం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంను ఎత్తివేసే ప్రయత్నంలో భాగంగానే బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్యం, లచ్చయ్య, ధనుంజయ, జాని, గుట్టయ్య, ప్రభాకర్, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



బయ్యారం: ఆందోళన చేస్తున్న నాయకులు

ఉపాధిమార్గాలు ఎంచుకోవాలి

తొర్రూరు: మహిళలు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు అన్నారు. శ్రీవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో కొనసాగిన మగ్గం శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్, సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ నాగవాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉషా దయాకర్‌రావు మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి నర్మద, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

తొర్రూరు రూరల్: పుట్టిన ప్రాంతానికి సేవలందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ, మండలంలోని వెలికట్ట వాసి ఆబోతు మధు యాదవ్‌కు గుర్తింపు లభించింది. తాజాగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన టీవీ నటుల సన్మాన కార్యక్రమంలో వెలికట్ట వాసి మధు యాదవ్‌ను సత్కరించారు.

భాషా పండిట్‌లకు పదోన్నతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలోని భాషా పండిత ఉపాధ్యాయ, పీఈటీల పోస్టులు అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిట్ పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడిపల్లి రమేష్, కొలిపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జాక్ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు సెంటర్‌లో జిల్లా భాషా పండిట్‌ల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాక్ నాయకులు సూర్య ప్రకాష్, మహేశ్వరి, సోని, రాంబాబు, ప్రభాకర్, ప్రదీప్ కుమార్, యుగంధర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రభుత్వం న్యాయం చేయాలని శనివారం భాషా పండిట్‌లు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములు, ఉమారాణి, పద్మావతి, తిరుమల పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

నిధుల కేటాయింపులో పక్షపాతం తగదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

గార్ల: మండలంలోని మద్దివంచ పంచాయతీకి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల విడుదలలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు పక్షపాతం వహిస్తున్నారని మద్దివంచ సర్పంచ్ కుసిని బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం ఎంపీడీఓ రవీందర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మద్దివంచ పంచాయతీలో సర్పంచ్‌గా న్యూడెమోక్రసీ పార్టీ గెలుచుకుందనే అక్కసుతోనే, అధికార పార్టీ నాయకులు, అధికారులు తమ పంచాయతీలో 3 సంవత్సరాల నుంచి సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీ మండల కార్యదర్శి జడ సత్యనారాయణ, గౌని భద్రయ్య పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

డోర్నకల్: హైదరాబాద్‌లో జరుగుతున్న మాస్టర్స్ నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు గెల్చుకున్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మాస్టర్స్ మెన్స్, ఉమెన్స్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో స్థానిక భారత్‌వీర్ వ్యాయామశాల నుంచి మండలోజు సుధాకర్ పాల్గొని 75కేజీల విభాగంలో స్నాచ్ 50కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 60కేజీలు కలిపి 110కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకున్నారు. పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ మున్సిపాలిటీ పారిశుద్ధ్యం ఉద్యోగి వీరదాసు లక్ష్మణ్ 85కేజీల విభాగంలో స్కాడ్ 120కేజీలు, బెంచ్‌ప్రెస్ 100 కేజీలు, డెడ్ లిఫ్టింగ్ 130 కేజీలు కలిపి 350 కేజీలు ఎత్తి బంగారు పతకం గెల్చుకున్నాడు. లక్ష్మణ్‌తో పాటు సుధాకర్‌ను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ అభినందించారు.



పోటీల్లో పాల్గొన్న లక్ష్మణ్

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



కోళ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకటరెడ్డి, జిల్లా అధికారి సుధాకర్

కురవి: పెరటికోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని కురవి జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సుధాకర్ అన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ సహకారంతో శనివారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్) గ్రామంలో 50మంది ఎస్సీ మహిళలకు 1000 పెరటి కోళ్లు, దాన, పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకం కింద పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జంగిలి హరిప్రసాద్, జీవన్, బోడ శ్రీను, వార్డు సభ్యులు భవాని, రాంబాబు, వెంకటలక్ష్మీ, జాఫర్‌ఖాన్, రాజు, వసంత, కార్యదర్శి రాము, పశు వైద్యాధికారులు రాంచందర్, రాజేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని యాదవనగర్‌కు మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం విద్యుత్ స్తంభాలకు భూమి లోపల నుంచి కేబుల్‌ను అమర్చే పనుల కోసం జేసీబీ యంత్రంతో తవ్వకాలు జరుపుతుండగా బీఎస్‌ఎన్‌ఎల్ ఎక్స్చేంజీ ఎదురుగా రెండు ప్రాంతాల్లో పైపులు పగలడంతో యాదవనగర్‌లోని ఆరు వీధుల్లో తాగునీటి సరఫరా నిలిచింది. శుక్రవారం కురవి సమీపంలో భగీరథ పైపులు పగలడంతో డోర్నకల్ పట్టణానికి నీటి సరఫరా నిలిచింది. శాంతినగర్‌లో ఓ టెలిఫోన్ స్తంభం తొలగిస్తుండగా భూమిలోని పైపులు పగలడంతో శనివారం పైపుల ద్వారా నీరంతా రోడ్డుపై వృథాగా పోవడంతో యాదవనగర్‌లో పలు వీధుల్లో తాగునీటి సరఫరా నిలిచింది.



పైపు పగిలి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఎండుతున్న పంటలు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్తున్న నిరంతర విద్యుత్ ప్రకటనలు సత్యదూరమని, నిత్యం కోతలు విధిస్తున్నారని మాజీ టీపీసీసీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్‌రావు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు, ట్రాన్సుఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు కందాడి అచ్చిరెడ్డి, ధీకొండ శ్రీనివాస్, నలమాస సమ్మయ్య, బచ్చలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: యాసంగి వరి పంటలో వచ్చే కాండం తొలుచు పురుగుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మల్యాల శాస్త్రవేత్తలు కాంత్రి కుమార్, రాంబాబు తెలిపారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల శాస్త్రవేత్తలు ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డితో కలిసి వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. రైతులు అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నివారణ చర్యలపై సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతు కోఆర్డినేటర్ దేశబోయిన శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పోరాట ఫలితమే వేతనాల పెంపు

నెహ్రూసెంటర్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ చేసిన పోరాటాల ఫలితమే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంపు చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జగన్నాథ భవన్‌లో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రంలో జరుగనున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాజమౌళి, వీరన్న, శ్రీనివాస్, నాగన్న, మల్లయ్య, మౌనిక, సరోజ పాల్గొన్నారు.

బొడ్రాయి సందడి



హోమంలో పాల్గొన్న భక్తులు



పాలకర్ర వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అభిషేకం చేస్తున్న మహిళలు





జలాభిషేకానికి వెళ్తున్న మహిళలు

జిల్లా కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ సందర్భంగా శనివారం సందడి కనిపించింది. భక్తులు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవత అయిన బొడ్రాయి, పాలకర్రకు పూజలు చేశారు. ఐదు విశేష యజ్ఞ కుండాలు ఏర్పాటు చేయగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. – మహబూబాబాద్ రూరల్

సంక్షిప్త సమాచారం

14నుంచి బొడ్రాయి వేడుకలు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం కరపత్రాలను సర్పంచ్ గంట సంజీవరెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ కన్వీనర్ పెరుమాండ్ల ఎల్లాగౌడ్, ఎంపీటీసీ గంట అశోక్‌రెడ్డి, వెంకన్న, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వినతి

కేసముద్రం: కరోనాకు ముందు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉన్న రైళ్లను, కేంద్ర ప్రభుత్వం తిరిగి ఆ రైళ్లను పునరుద్ధరించాలంటూ శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్‌కు గ్రామస్తులు చాగంటి కిషన్, వేం నర్సింహారెడ్డిలు వినతిపత్రాన్ని అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు



మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామంలో సుమారు నాలుగు వందల ఏళ్ల నాటి మహావినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠమహోత్సవానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఈ మహోత్తర కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు కట్కూరి నరేందర్ రెడ్డి–గీతాంజలి దంపతుల ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ పూజలను వేద పండితులు నడుమ చేట్టారు. శనివారం ప్రత్యేక ప్రతిష్ఠ పూజలు జరిపించారు.

కేసీఆర్ కిట్ అందజేత

చిన్నగూడూరు: సర్కారు దవాఖానాల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. శనివారం మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన అనూషకి వైద్యాధికారి ప్రవీణ్ సుఖ ప్రసవం చేశారు. అనంతరం కేసీఆర్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ మాధవి, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర్లు, రాధాకుమారి, ఆశకార్యకర్త పుష్ప ఉన్నారు.

అంబేద్కర్ అందరివాడు

కేసముద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మందుల క్రిష్ణమూర్తి అన్నారు. శనివారం సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌పై, కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, రాజ్యాంగ ఫలాలను కనుమరుగు చేసే కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల కోఆర్డినేటర్ నాగరాజు, అరుణ్‌కుమార్, వెంకన్న, ఆనంద్, మదార్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

పెద్దవంగర: విద్యార్థులు ఇష్టంగా చదువితే మంచి ఫలితాలు సాధిస్తారని కేరింగ్ హ్యాండ్స్ టుగెదర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడురాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో రూ.4వేల విలువ చేసే స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, అంజయ్య, సువర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నర్సింహులపేట: మండలంలోని గోపాతండాలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం ఎంపీపీ టేకుల సుశీల ప్రారంభించారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సీడీఎఫ్ నిధుల నుంచి మంజూరైన నిధులతో ప్రారంభం చేసినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి, హోళీ, ఎంపీటీసీ నాయకీ, నాయకులు యాదగిరి రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

డోర్నకల్: డోర్నకల్, గార్ల మండలాల సరిహద్దులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రావూరి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం స్థానిక విశ్వబ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు.

ఏకాగ్రతతో విజయం

గార్ల: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చని ప్రముఖ కవి, మానసిక కౌన్సిలర్ దర్భశయనం శ్రీనివాసాచార్యులు సూచించారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో పరీక్షల్లో విజయంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులుసురేష్, జోగ్యా, రవీందర్, సోమన్న, నాగేశ్వరరావు, రాంబాబు, సుజాత, విమల పాల్గొన్నారు.

మిర్చి తోటల పరిశీలన

కురవి: మండలంలోని బలపాల శివారు లింగ్యాతండా గ్రామంలో మిర్చిపంట సాగు చేసి నష్టపోయిన పంట క్షేత్రాలను ఉద్యానవన శాఖ అధికారి అనితాశ్రీ, శాస్త్రవేత్త భాస్కర్‌లు శనివారం పరిశీలించారు. మిర్చి పంట వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు లింగ, భూక్య అచ్చమ్మ, రాంజీ, శ్రీకాంత్, గిరిజన సంఘం నాయకుడు కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

నెల్లికుదురు: రెండో విడత గొర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని గొర్ల మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ యోగేశ్వర రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జీఎంపీఎస్ క్యాలెండర్, డైరీని ఎస్సై పత్తిపాక జితేందర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకన్న, రాజుకుమార్, ఎల్లయ్య, రవికుమార్, మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కురవి: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన శనివారం మండలంలోని రాజోలు శివారు పోలంపల్లి తండా గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోలంపల్లి తండాకు చెందిన బానోత్ చిన్ని అనే మహిళ ఇంటికి తాళం వేసి కూలిపనికి వెళ్లింది. మధ్యాహ్నం విద్యుత్ తీగలు కాలిపోయి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కాలిపోయాయి. దీంతో రూ.లక్ష నష్టం వాటిల్లింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోర్నకల్: స్థానిక యాదవనగర్‌లో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం డోర్నకల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదవగనర్‌లో పేకాడుతున్న నరేష్, రాజ్‌కుమార్, ఫ్రాన్సిస్, మౌలానాను అదుపులోకి తీసుకుని రూ.560 నగదు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు.

తొర్రూరు: రహస్యంగా పేకాట ఆడుతున్న పలువురిని మండలంలోని మాటేడులో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామంలో పేకాట ఆడుతున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఎస్సై సతీష్ వివరణ కోరగా.. మాటేడులో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారని సమాచారం ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ఉమ్రావ్‌దేవి నేత్రాలు దానం



డోర్నకల్: అనారోగ్యంతో మృతి చెందిన ఉమ్రావ్ దేవి(87) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. 87 సంవత్సరాల వయసులో కళ్లద్దాల అవసరం లేకుండా తన పనులు తానే చేసుకుంటూ ప్రతీ రోజూ జైన సంప్రదాయాలు, భక్తికి సంబంధించి పుస్తకాలు చదివే ఉమ్రావ్‌దేవి వయోభారం, అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. దీంతో ఖమ్మంకు చెందిన నేత్రనిధి సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యుల సమక్షంలో ఉమ్రావ్‌దేవి నేత్రాలను సేకరించారు. ఆమె కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, పట్టణ అధ్యక్షుడు కత్తెర సాల విద్యాసాగర్, కురవి జెడ్పీటీసీ సభ్యులు బండి వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్లు, తదితరులు పరామర్శించారు.